

గత వైసీపీ ప్రభుత్వంలో రొయ్యూరు, కరకట్ట వెంబడి మరికొన్ని రీచ్‌లలో వందల కోట్ల ఇసుక దోపిడీ జరిగింది. ఈ దోపిడీలో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంట్రాక్టు తీసుకున్న ఏజెన్సీలు భాగస్వాములు. వీరి దోపిడీకి సంబంధిత మైనింగ్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు సహకరించారు. ఆ అధికారులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ని సైతం పక్కదారి పట్టించిన సంగతి విదితమే. రొయ్యూరులో అడ్డూ అదుపు లేకుండా ఇసుక దోపిడీ జరిగితే అధికారుల బృందం ఏనాడో మూతపడిన నార్తువల్లూరు క్వారీని పరిశీలించి ఎన్జీటీకి దొంగ నివేదికలు ఇచ్చి అక్రమాలకు పూర్తిస్థాయిలో సహకరించారు. ఇపుడు వైసీపీ ప్రభుత్వం మారి టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో ఇసుక దోపిడీపై విచారణ చేస్తుందా లేదా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



మల్లవల్లిలోని పార్లే ఆగ్రో ప్లాంట్

పనులకు సిద్ధమైన పార్లే ఆగ్రో

మల్లవల్లికి పునర్వైభవం

టీడీపీ నేతృత్వంలో కూటమి అధికారంలోకి రావడంతో పారిశ్రామిక ప్రగతికి జీవం పోసినట్టయింది. పారిశ్రామికాభివృద్ధి లేక తిరోగమనం పట్టిన మల్లవల్లికి పునర్వైభవం రానుంది. వైసీపీ హయాంలో సహాయ నిరాకరణ, వేధింపులకు గురైన 'పార్లే ఆగ్రో' మళ్లీ రంగంలోకి వచ్చింది. పార్లే ఆగ్రో యాజమాన్యం సీఎం చంద్రబాబును కలిసింది. మల్లవల్లిలో ప్లాంట్ పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్టు తెలిపింది. సీఎం చంద్రబాబు సానుకూల హామీ ఇవ్వటంతో మల్లవల్లిలోని మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో పక్షం రోజుల్లో ప్లాంట్ పనులను పునరుద్ధరించేందుకు సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. స్థానికంగా తక్షణం 500 నుంచి 1000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

- టీడీపీ ప్రభుత్వ హయాంలో మల్లవల్లిలో డ్రింక్స్ యూనిట్‌కు శ్రీకారం
- యూనిట్ కోసం ఇండస్ట్రియల్ నిర్మాణం కూడా పూర్తి
- వైసీపీ ప్రభుత్వ హయాంలో సహకారం నాస్తి
- పూర్తిస్థాయిలో ప్లాంట్‌ను ఏర్పాటు చేయలేకపోయిన సంస్థ
- కూటమి అధికారంలోకి రావటంతో సీఎం చంద్రబాబును కలిసిన యాజమాన్యం
- పక్షం రోజుల్లో పనులు ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్న పార్లే ఆగ్రో

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/జంక్షన్ రూరల్): గత ఐదేళ్లుగా మల్లవల్లిలోని మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో కొత్త పరిశ్రమలు ఒక్కటీ రాలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పడిన పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు తప్పితే కొత్తగా ఒక్కటీ లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో భూములు దక్కించుకున్నాయని, పనులు మొదలు పెట్టాయని ఒకే ఒక్క కారణంగా ఆయా యూనిట్ల నిర్వాహకులపై వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడింది. వైసీపీ ప్రభుత్వం వచ్చీ రాగానే.. విజిలెన్స్ విచారణల పేరుతో పారిశ్రామిక సంస్థలను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ షాక్ నుంచి కోలుకునేలోపు కరోనా వచ్చింది. ఈ పరిస్థితుల్లో పారిశ్రామిక రంగం కకావికలమైంది. అనేక సంస్థలు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క అంగుళం కూడా ముందుకు కదలలేకపోయాయి. అలా ఇబ్బందులు పడ్డ సంస్థల్లో పార్లే ఆగ్రో కూడా ఒకటి.

పార్లే ఆగ్రో మల్లవల్లికి ఎలా వచ్చింది?

పార్లే ఆగ్రోస్ అనేది దేశంలోనే అతి పెద్ద బేవరేజెస్ కంపెనీ. 1985 నుంచి బేవరేజెస్ రంగంలోకి దిగింది. దేశంలోని బేవరేజెస్ కంపెనీలలోనే అగ్రస్థానం సాధించింది. దీని హెడ్ క్వార్టర్ ముంబయిలో ఉంది. ముంబయిలోని కంపెనీలో 5500 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. డ్రింక్స్ కేటగిరీలో పార్లే ఆగ్రో అనేక సొంత ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ క్రమంలో పార్లే ఆగ్రో సంస్థ దక్షిణ భారత దేశంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో మల్లవల్లిలోని ఇండస్ట్రియల్ పార్క్‌లో తమ బేవరేజెస్ యూనిట్‌ను ఏర్పాటు చేయటానికి గత టీడీపీ ప్రభుత్వంలో ముందుకు వచ్చింది. మల్లవల్లిలో భారీ పరిశ్రమల కేటగిరీలో పార్లే ఆగ్రోకు కూడా అప్పటి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్లాంట్ స్ట్రక్చర్‌ను కూడా పూర్తి చేసింది.

రూ.158 కోట్ల పెట్టుబడి.. వెయ్యి ఉద్యోగాలు

మల్లవల్లిలో అశోక్ లేల్యాండ్ కంపెనీకి కేటాయించిన భూముల పక్కనే పార్లే ఆగ్రో సంస్థకు 25 ఎకరాలను గత టీడీపీ ప్రభుత్వం పార్లే ఆగ్రోకు కేటాయించింది. ఈ భూముల్లో రూ.158 కోట్ల వ్యయంతో బేవరేజెస్ యూనిట్ ఏర్పాటు చేయటానికి గత టీడీపీ ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఎంఓయూ ప్రకారం ముందుగా 500 మందికి ఉద్యోగాలు కల్పిస్తామని, భవిష్యత్తులో విస్తరిస్తే 1000 మంది వరకు ఉద్యోగాలలు కల్పిస్తామని పార్లే ఆగ్రో పేర్కొంది. ఎంఓయూ ప్రకారం కేటాయించిన భూములను అవుట్ రేట్ సేల్ (ఓఆర్ఎస్) విధానంలో కొనుగోలు చేసింది. ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన క్రమంలో కరోనా తదనంతర పరిస్థితుల కారణంగా ఈ సంస్థకు ఆర్థిక ఇబ్బందులు కూడా తలెత్తాయి. ఈ క్రమంలో కొత్త ప్లాంట్ల జోలికి వెళ్లకుండా ఉత్పాదకతపై దృష్టి సారించింది.

ఐదేళ్లుగా హృదయ విదారకం

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్లే ఆగ్రో ప్లాంట్ పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. ప్లాంట్‌లో మొక్కలు మొలిచి ఉన్నాయి. ప్లాంట్ ఆవరణలోనే ఖరీదైన ఐరన్ సామగ్రి నిరుపయోగంగా పడి ఉంది. ప్లాంట్ ఏర్పడింది కానీ, అందులో మిషనరీ ఏర్పాటు జరగలేదు. ఆవరణ అంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ప్లాంట్ పనుల కోసం కంటెయినర్ క్యాబిన్లను తెప్పించారు. ఐదేళ్లూ ఎలాంటి పనులు జరగకపోవటంతో ఈ కంటెయినర్లు తుప్పుపట్టిపోయి ఉన్నాయి. సెక్యూరిటీ రూమ్ కూడా మొక్కల మధ్యన ఉండిపోయింది. చూడటానికి దయనీయ స్థితిలో ఉంది. భారీ ప్లాంట్ ఏర్పాటు చేసినప్పటికీ అలంకారంగా ఉంది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం రావటంతో పార్లే ఆగ్రో సంస్థ పక్షం రోజుల్లో ప్లాంట్ పునరుద్ధరణ పనులు చేపట్టబోతోంది.



ఐరన్ మెటీరియల్

తోడేళ్లను పట్టేస్తారా?



రొయ్యూరు ప్రైవేటు భూముల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు (ఫైల్)

వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఇసుక దోపిడీ

మొదట్లో ప్రభుత్వం, తరువాత జేపీ వెంచర్స్, కేసీవైసీ పేరుతో తవ్వకాలు

- రొయ్యూరు, లంకపల్లి, మద్దూరు, చోడవరం క్వారీల్లో దందా
- రొయ్యూరు రైతుల పట్టా భూముల్లో ఏకపక్షంగా తవ్వకాలు
- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను తప్పుదారి పట్టించిన అధికారులు
- రొయ్యూరుకు బదులు నార్తువల్లూరు క్వారీ పరిశీలన

తోట్లవల్లూరు మండలంలోనే రూ.వెయ్యి కోట్ల అవినీతి

తోట్లవల్లూరు : వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజుల్లోనే ఉచిత ఇసుక పథకాన్ని రద్దు చేసింది. ఎక్కడా ఇసుక దొరకకుండా చేసి ఇసుక ముఠా కార్మికులు, తాపీ కార్మికులు రోడ్డున పడేసింది. ఆ తరువాత కొంతకాలం ప్రభుత్వమే ఇసుక తవ్వకాలు జరపటంతో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల దోపిడీ మూడుపువ్వులు ఆరుకాయలు అన్నట్టుగా సాగింది. తరువాత జయప్రకాష్ వెంచర్స్ (జేపీ)కు రాష్ట్రంలోని ఇసుక క్వారీలను అప్పగించేశారు. పేరుకి జేపి వెంచర్స్ అయినా వెనుకున్నది మాత్రం వైసీపీ పెద్దలే. రొయ్యూరు, వల్లూరుపాలెంలో పర్వతాలను తలపించే విధంగా ఇసుకను నిల్వచేసి వైసీపీ నేతల సిఫార్సు ఉన్న వారికే విక్రయించేవారు. ఇసుక రవాణాను తనిఖీ చేసే అధికారం ఒక్క ఎస్ఈబీకి తప్పా మిగతా ఎవ్వరికీ లేకుండా ప్రభుత్వ పెద్దలు కట్టడి చేశారు. శ్రీకాకుళం, లంకపల్లి, మద్దూరు, చోడవరం క్వారీల్లో సైతం భారీ దోపిడీ సాగించారు.

ఇసుక అక్రమాలపై న్యాయ పోరాటం

జేపీ వెంచర్స్ తవ్వకాలు ముగిశాక జీసీకేసీ ప్రాజెక్టు అండ్ వర్క్స్ (ప్రై) లిమిటెడ్‌కు జిల్లాలోని ఇసుక క్వారీలను ప్రభుత్వం అప్పగించింది. నిబంధనల ప్రకారం క్వారీ ఉన్న మండలంలోని రెవెన్యూ అధికారులను, మైనింగ్, భూగర్భజల శాఖ అధికారులను సంప్రదించి వారు సూచించిన ప్రదేశంలో ఇసుక తీయాలి. కానీ జీసీకేసీ సంస్థ ఈ నిబంధనలను పాటించకుండా రొయ్యూరులో జనవరిలో ఇసుక తవ్వకాలు చేపట్టింది. అక్రమ ఇసుక తవ్వకాలను ఆపాలని రొయ్యూరు ప్రజలు ప్రత్యక్ష ఆందోళనలకు దిగిన మూడుసార్లు స్థానిక తహసీల్దార్ ఎం.కుసుమకుమారి ఇసుక తవ్వకాలను ఆపినా పెద్దల అండతో రోజుల వ్యవధిలోనే తిరిగి చేపట్టేవారు. ఇలా జిల్లా పెద్దల అండదండలు, వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో అంతులేని ఇసుక దోపిడీ జరిగింది. కృష్ణానది పాయల్లో పర్యావరణానికి ఇబ్బందికలిగే విధంగా అనుమతులు లేకుండా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై గుంటూరు జిల్లాకు చెందిన నాగేంద్ర అనే వ్యక్తి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఎక్కడెక్కడ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి? వాటికి పర్యావరణ అనుమతులున్నాయా? పర్యావరణానికి ఎంత నష్టం చేకూర్చారు?అనే అంశాలను పరిశీలించి నివేదికలను అందించాలని కలెక్టర్లకు ఫిబ్రవరిలో ఆదేశాలిచ్చింది. దాంతో వైసీపీ ప్రభుత్వ పెద్దలు అధికారులను తప్పుడు నివేదికలు ఇచ్చేలా అప్రమత్తం చేశారు.

ప్రభుత్వం మారింది.. విచారణ ఉంటుందా?

వైసీపీ ప్రభుత్వం మారి టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో నాటి ఇసుక దందాపై దృష్టిసారించి విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాకు చెందిన మచిలీపట్నం ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర గనులశాఖా మంత్రి కావటంతో వైసీపీ పెద్దల ఇసుక దోపిడీపై చర్యలు తీసుకునే దిశగా అడుగులు వేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

అక్రమాల్లేవంటూ అధికారుల వత్తాసు

ఫిబ్రవరి 12వ తేదీన నాటి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఆధ్వర్యంలో ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు, మైనింగ్ సర్వేయర్ రామలక్ష్మీ పలువురు అధికారులు ఇసుక తవ్వకాల పరిశీలనకు వచ్చారు. 12వ తేదీన ఉదయం నుంచి రొయ్యూరులో జీసీకేసీ సంస్థ ఇసుక తవ్వకాలను ఆపివేశాక మధ్యాహ్న సమయంలో సదరు అధికారుల బృందం పాములలంక వద్ద పెద్దపటిపాయలోని మూడున్నరేళ్ల క్రితం మూతపడిన నార్తువల్లూరు క్వారీకి వెళ్లి పరిశీలించి ఇక్కడ ఇసుక తవ్వకాలేమి జరగటం లేదని చెప్పి వెళ్లిపోయారు. ఈ అధికారులు మండలంలో నుంచి వెళ్లిన గంటలోనే రొయ్యూరు క్వారీలో ఇసుక తవ్వకాలు చేపట్టారు. అంటే అధికారులు ఇసుక క్వారీ నిర్వాహకులకు ఎంత ముందస్తు సమాచారం ఇచ్చి అన్ని విధాలుగా సహకరించారో తేటతెల్లమవుతుంది. అధికారుల నిర్వాకంపై ఫిబ్రవరి 13న ఆంధ్రజ్యోతి వార్తా కథనం సైతం ప్రచురించిన విషయం విదితమే. తరువాత ఎక్కడా ఇసుక తవ్వకాలు జరగటం లేదని, యంత్రాలను ఎక్కడా వినియోగించలేదని అధికారులు ఎన్జీటీకి నివేదికలు ఇచ్చిన విషయం కూడా బయటపడింది.



సీటు వదల!

ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్ల కొత్త రూటు

- ఇక్కడ నుంచి కదలటానికి ససేమిరా..
- వైసీపీ ప్రభుత్వంలో అవినీతిపరుల దూరాలోచన
- టీడీపీ ఎమ్మెల్యేల చుట్టూ తిరిగినా దక్కని హామీ
- ద్వితీయ శ్రేణి నాయకులు, ముఖ్యకార్యకర్తలతో మంతనాలు సాగించి ఎమ్మెల్యేలపై ఒత్తిళ్లు
- ఇతర జిల్లాలకు వెళ్లిన వారిలో కొందరు అక్కడే ఆసక్తి..
- పాత స్థానంలోకి వచ్చేందుకు మరికొందరు పైరవీలు

సీటు మీద మమకారమో? కాసులపై యావో తెలియదు కానీ కొందరు రెవెన్యూ తహసీల్దార్లు సీటు వదలమంటున్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ బదిలీలపై వచ్చిన ఇతర జిల్లాల రెవెన్యూ తహసీల్దార్లు సీటు వదలటానికి ఏమాత్రం ఇష్టపడటం లేదు. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వెళ్లిన తహసీల్దార్లు కొందరు కూడా ఆ జిల్లాల నుంచి రావటానికి ఇష్టపడటం లేదు. తమకిష్టమైన స్థానాల్లో కొనసాగేందుకు రెవెన్యూ తహసీల్దార్లు పైరవీలు మొదలెట్టారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్నికల సమయంలో బదిలీలపై పొరుగు జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు తిరిగి సొంత జిల్లాలకు రావాల్సి ఉంటుంది. దీనిపై త్వరలో ఆదేశాలు వెలువడే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలు మారిన తహసీల్దార్లంతా తిరిగి సొంత జిల్లాలకు రావాల్సి ఉంటుంది. పొరుగు జిల్లాల నుంచి వచ్చిన వారంతా కూడా తిరిగి వారి సొంత జిల్లాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను కాదని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగించుకున్నట్టుగా ఎమ్మెల్యేలను కలుసుకుని ప్రసన్నం చేసుకునే ఎత్తులు వేస్తున్నారు.

నేను మీ పార్టీనే అంటూ కలిపేసే యత్నం

నేను మీ పార్టీనే అంటూ సంకేతాలు పంపుతున్నారు. కిందటి వైసీపీ ప్రభుత్వ ఎమ్మెల్యేల మాదిరిగా ఏ ఒక్క టీడీపీ, జనసేన ఎమ్మెల్యే కూడా తహసీల్దార్ల నుంచి వస్తున్న ప్రతిపాదనలను తోసివేస్తున్నారు. ఎమ్మెల్యేలు మాట వినటం లేదని ద్వితీయ శ్రేణి నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ద్వితీయ శ్రేణి నాయకులు, ఎమ్మెల్యేలు బాగా ఇష్టపడే కార్యకర్తలను కూడా వదలకుండా ఫోన్లు చేస్తూ ఇక్కడే ఉండిపోవటానికి పావులు కదుపుతున్నారు. విజయవాడ గ్రేటర్ విలీన జాబితా పరిధిలో ఉన్న అన్ని గ్రామీణ మండలాల్లో దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొంది.

భూముల కొనుగోలులో భారీ దోపిడీ

వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ గ్రేటర్ పరిధిలోని - మిగతా 6లో

దసరా లక్ష్యంగా..



చకచకా సాగుతున్న శివాలయం పనులు

దుర్గగుడి అభివృద్ధిపై కొత్త సర్కార్ దృష్టి

- అక్టోబరు మొదటి వారానికి పనుల పూర్తికి కసరత్తు
- ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా
- పనులు పరుగులు పెట్టించాలన్న మంత్రి ఆనం
- నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ
- ఎలివేటెడ్ క్యూకాంప్లెక్స్, అన్నదాన భవనం..
- ఇతర పనులు దసరా నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక
- గతంలో రెండుసార్లు శంకుస్థాపనలు చేసిన జగన్
- నిధుల కొరతతో నత్తనడకన సాగుతున్న పనులు



దుర్గగుడికి కొత్తశోభ తీసుకొచ్చే దిశగా నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలతో దేవస్థానం ప్రాభవం మసకబారుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం గుడిపై రాజకీయాలకు స్వస్తి పలికి పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా కసరత్తు ప్రారంభించింది. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఇటీవల దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గగుడిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నిధుల కొరత లేకుండా చూసే బాధ్యత తమదని హామీ ఇచ్చినట్టు తెలిసింది. దసరా నాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో పలుమార్లు ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు చేసి హడావిడి చేశారే తప్ప పనులు శరవేగంగా సాగింది లేదు. 2021లో సీఎం హోదాలో జగన్ దుర్గగుడికి వచ్చి అభివృద్ధి పనులకు రూ.70 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. కానీ పైసా విదిల్చింది లేదు. 2023 డిసెంబరులో మరోసారి దుర్గగుడికి వచ్చిన జగన్ ఎన్నికల సమయం కావడంతో పలు పనులకు ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు చేశారు. అయితే నిధుల కొరతతో ఇవి నత్తనడక నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం దుర్గగుడి అభివృద్ధి పనులపై దృష్టి సారించింది. దాతలు సమకూర్చిన రూ.5 కోట్ల నిధులతో నిర్మాణం చేపట్టిన యాగశాల పనులు తుది దశలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న పనుల్లో అన్నప్రసాద భవనం, ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, ప్రసాదం పోటు, పూజామండపాల పనులు ప్రారంభదశలో ఉన్నాయి.

ఒకేసారి 2వేల మందికి అన్నదానం

దసరా ఉత్సవాల సమయంలో దుర్గగుడికి భక్తులు పోటెత్తుతుంటారు. ప్రతిరోజూ లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటుంటారు. ఇటీవల కాలంలో దుర్గగుడికి భక్తుల సంఖ్య బాగా పెరిగింది. సగటున రోజుకి 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అన్నప్రసాద భవనాన్ని భారీ ఎత్తున నిర్మాణం చేస్తున్నారు. రూ.30 కోట్ల వ్యయంతో జీ ప్లస్1 భవనాన్ని నిర్మిస్తున్నారు. ఒకేసారి 2వేల మంది భోజనాలు చేసేలా ఈ భవన నిర్మాణం జరుగుతోంది. దీంతోపాటు రూ.27 కోట్లతో అమ్మవారి ప్రసాదం పోటును జీ ప్లస్ 4 భవనంగా నిర్మాణం చేస్తున్నారు. ప్రసాదం తయారీ, ప్యాకింగ్, విక్రయాలు అన్నీ ఈ భవనంలోనే జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



మహామండపం మార్గంలో వేగంగా జరుగుతున్న పనులు

పూజల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

ప్రస్తుతం లక్ష కుంకుమార్చన, శ్రీ చక్ర అర్చన వంటి పూజలు ఆలయ ప్రాంగణంలో జరుగుతున్నా వాటికి ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేయలేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పూజా మండపాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.7 కోట్ల వ్యయంతో వీటిని నిర్మాణం చేస్తున్నారు. దీంతో ప్రత్యేక పూజలు చేసుకునే భక్తులకు వెసులుబాటు కలుగుతుంది.

భక్తుల రద్దీ నియంత్రణకు..

పెరుగుతున్న భక్తుల రద్దీ నియంత్రణకు దుర్గగుడి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా కనకదుర్గనగర్ ప్రవేశ మార్గం నుంచి ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.13 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో దసరా నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతోపాటు రూ.75 లక్షలతో కనకదుర్గానగర్ నుంచి మహామండపం వరకు రాజమార్గం, కనకదుర్గానగర్ ప్రవేశం వద్ద రూ.70 లక్షలతో మహారాజద్వారం వంటి పనులు జరుగుతున్నాయి.

నూతన కేశఖండనశాల..

దుర్గగుడి చెంత ఉన్న వాటర్ ట్యాంకు స్థలంలో కొత్త కేశఖండనశాలను రూ.19 కోట్లతో నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అయితే వాటర్ ట్యాంకు ఉన్న స్థలం 10 సెంట్లు వీఎంసీ ఆధీనంలో ఉంది. దుర్గగుడికి చెందిన స్థలం 13 సెంట్లతోపాటు ఈ 10 సెంట్ల స్థలాన్ని కలుపుకొని కేశనఖండనశాలను భక్తులకు సౌకర్యవంతంగా నిర్మాణం చేయాలన్న ఆలోచనలో అధికారులు - మిగతా 6లో

భూ నిర్వాసితులకు పరిహారం

అధికారులకు కలెక్టర్ ఆదేశం



6లో..

అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

- మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ఆదేశం



ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితతో కృష్ణాజిల్లా ఎస్పీ నయీం అస్మీ భేటీ

మచిలీపట్నం టౌన్, జూన్ 18 : హోం మంత్రి వంగలపూడి అనిత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణపై ఎస్పీకి మంత్రులు సూచనలు చేశారు.

అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

● మున్సిపల్ కమిషనర్లకు కృష్ణా కలెక్టర్ ఆదేశం

మచిలీపట్నం, జూన్18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలోని అన్ని పురపాలకసంఘాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. కలెక్టర్ బంగ్లా నుంచి మంగళవారం మునిసిపల్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన భవనాల్లో సచివాలయాలు ఉంటే వాటిని వేరొక ప్రాంతానికి మార్చాలని సూచించారు. మచిలీపట్నం మూడుస్తంభాల సెంటరులో అన్న క్యాంటీన్‌లోని సచివాలయాన్ని మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మచిలీపట్నం నగర కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు తెలిపారు. గుడివాడ పురపాలకసంఘంలో రెండు అన్న క్యాంటీన్లు గతంలో ఉండేవని, ఒక భవనంలో సచివాలయం ఏర్పా టు చేశారని, సచివాలయాన్ని వేరే భనంలోకి మార్చేందుకు చర్యలు చేపట్టామని గుడివాడ మునిసిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. తాడిగడప మునిసిపాలిటీ నూతనంగా ఏర్పడిన నేపథ్యంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.



రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డిని కలిసిన రవాణా శాఖ ఉద్యోగులు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

● ఉద్యోగ సంఘం నాయకులతో రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

వన్‌టౌన్, జూన్ 18 : ప్రజలకు మరింత చేరువుగా అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహించాలని రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రామవరప్పాడురింగ్ సెంటర్‌లోని కె.హోటల్‌లో మంగళవారం మంత్రిని రవాణా ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఉన్నతాధికారులతో త్వరలోనే సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐ.రఘుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయడంలో ముందుంటామని తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరి, సంఘం నాయకులు డి.శ్రీనివాస్, ఎం.ఆనంద్ కుమార్, జోనల్ అధ్యక్షులు ఎం.రాజబాబు, ఎం.శ్రీనివాసరావు, పి.లక్ష్మీకరరెడ్డి, నాయకులు వి.రాకేష్, మధుకర్‌బాబు, రమాదేవి, బాలజ్యోతి, అనురాధ, కే.వీవీ నాగమురళీ, వీహెచ్ షైదిరాజు, ఏ.బాలరాజు, ఎన్.నాగశంకర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, పిడుగుపడి దెబ్బతిన్న ధ్వజస్తంభం

జగ్గయ్యపేటలో గాలివాన బీభత్సం

● ట్రాన్స్‌కోకు రూ.8 లక్షలు నష్టం

జగ్గయ్యపేట, జూన్ 18 : జగ్గయ్యపేట పరిసర ప్రాంతంలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో బలుసుపాడు రోడ్డులో సబ్‌స్టేషన్ సమీపంలో అనేక చెట్లు నేలకూలాయి. 13 విద్యుత్ స్తంభాలు రోడ్డుకడ్డంగా పడిపోయాయి. రాకపోకలు నిలిచిపోవటం, విద్యుత్‌లైన్‌లు తెగిపోవటంతో విద్యుత్ సరఫరా నిలిచి జగ్గయ్యపేట మండలంలో గాఢాంధకారం నెలకొంది. ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు శ్రమించి చెట్లను పక్కకు తొలగించి, విద్యుత్ వైర్లు కత్తిరించి రాకపోకలను పునరుద్ధరించారు. మంగళవారం తెల్లవారుఝామున పట్టణానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. గ్రామాల్లో తెల్లవారిన తర్వాత విద్యుత్ సరఫరా చేశారు. వర్ష బీభత్సానికి ట్రాన్స్‌కోకు రూ.8 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు ఏఈ కృష్ణారెడ్డి చెప్పారు. విద్యుత్ స్తంభాలను ఒకటి రెండు రోజుల్లో తిరిగి ఏర్పాటు చేస్తామన్నారు. అనుమంచిపల్లి రామాలయంలో పిడుగుపడి ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభం దెబ్బతిన్నాయి. అదే సమయంలో అక్కడ ఉన్న యువకులు పిడుగుల శబ్దానికి స్పృహతప్పి పడ్డారు. కాసేపటికి తేరుకుని ఇళ్లకు వెళ్లిపోయారు.



గ్రీవెన్స్ కార్యక్రమంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

● గ్రీవెన్స్ కార్యక్రమంలో కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం, జూన్18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తామని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఉద్యోగుల సమస్యలు తెలుసుకునేందుకు స్పందన సమావేశపుహాలులో మంగళవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఆయా విభాగాల జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ రెవెన్యూ అధికారులకు కోటా ప్రకారం సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇవ్వాలని, గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను పరిష్కరించాలని అధికశాతం మంది ఉద్యోగులు అర్జీలు ఇచ్చారు. టీచర్ల పీఎఫ్ ఖాతాలను ఆన్‌లైన్‌లో నవీనీకరణ చేయాలని, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించిన టీచర్లకు డ్యూటీసర్టిఫికెట్లు మంజూరు చేయాలని టీచర్లు అర్జీ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వీఆర్వోలకు పదోన్నతుల అంశంపై ఈనెల 20వతేదీన అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తానని హామీ ఇచ్చారు. ప్రావిడెంట్ ఫండ్ సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక శిబిరం నిర్వహించాలని అధికారులకు సూచించారు.

భ్రమలు వీడకపోతే జగన్‌కు అధోగతే

● ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన దుర్మార్గుడు జగన్
● అతడిని శిక్షించేందుకు సీఎం చంద్రబాబు కఠిన చట్టాలు తేవాలి
● విలేకరుల సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

విద్యాధరపురం, జూన్ 18 : మాజీ సీఎం జగన్ ఇంకా భ్రమలు వీడకపోతే మరో మూడు నెల్లో అధోగతి పాలవడం ఖాయమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి ట్విటర్‌లో ఇటీవల ఎన్నికలలో ఈవీఎంలు ట్యాంపరింగ్‌కు గురయ్యాయని చేసిన పోస్టింగ్‌పై శివనాథ్ స్పందించారు. గతంలో ఈవీఎంలు బాగా పనిచేశాయని జగన్ చెప్పిన వ్యాఖ్యల ఆడియోను ఆయన ప్రదర్శించారు. ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా మాట మార్చి ఈవీఎంలలోట్యాంపరింగ్ జరిగిందనడం, బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరపాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. 2019లో జగన్‌కు ఓటు వేసిన ప్రజలే అంతకుమించిన ఉత్సాహంతో ఇప్పుడు కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబునాయుడుకు మద్దతు పలికారన్నారు. ప్రజా తీర్పును గౌరవించలేక, ఓటమిని అంగీకరించలేక జగన్ పిచ్చి భ్రమల్లో ఉన్నారన్నారు. జగన్ జీవితమే ఒక మోసమని, సొమ్మును దోచుకోవడం అతని నైజమన్నారు. వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ఈడీ, సీబీఐ కేసులలో కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా ఇప్పుడు న్యాయం,ధర్మం, ప్రజాస్వామ్యం అంటూ ప్రస్తావించడం హాస్యాస్పదమన్నారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించని జగన్ ఈడీ కేసుల్లో జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. జగన్ తన ఇంట్లో ఏర్పాటు చేసుకున్న ఫర్నీచర్‌ను ప్రభుత్వానికి అప్పగించకపోతే ఫర్నీచర్ దొంగగా మిగిలిపోతారంటూ ఆనాడు కోడెల శివప్రసాద్‌ను వేధించిన తీరును చిన్ని ప్రస్తావించారు. ఇప్పటికైన జగన్ తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు వచ్చి తనను ప్రజలు ఎందుకు తిరస్కరించారో, ప్రజలకు ఏమి కావాలో, రాష్ట్రంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. లేకపోతే 11 మంది ఎమ్మెల్యేలు కూడా మిగలరని న్నారు. వైజాగ్ లో జగన్ ప్యాలెస్ బాగోతం ప్రజలకు ముందే తెలిసి ఉంటే ఆ 11 సీట్లు కూడా వచ్చేవి కావన్నారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన దుర్మార్గుడు జగన్ అన్నారు. జగన్ దుర్వినియోగం చేసిన సొమ్ము మొత్తం కక్కించే విధంగా సీఎం చంద్రబాబునాయుడు కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మరోసారి ఏ నాయకుడు ఇలా చేయకుండా చర్య లు తీసుకోవాలన్నారు. దోపిడీ సొమ్మును ప్రజల చెంతకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటమి చెందిన నాయకులు ప్రజాసమస్యలపై పోరాడాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తే ప్రజాజీవితానికి దూరమవుతారని తెలిపారు



మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్‌లను అభినందిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

మంత్రులు పార్థసారథి, గొట్టిపాటికి శుభాకాంక్షలు

మంత్రి కొలుసు పార్థసారథిని తాడిగడపలోని ఆయన నివాసంలో మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్ మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి సత్కరించారు. ప్రజాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించుకున్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, సీనియర్ టీడీపీ నాయకుడు బొప్పన భవకుమార్, ఎంపీ పొలిటికల్ సెక్రటరీ నరసింహ చౌదరి తదితరులు పాల్గొన్నారు. విద్యుత్‌శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవికుమార్‌ను నోవాటెల్‌లో కేశినేని శివనాథ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఉన్నారు.

మాజీ సీఎం జగన్‌ను ప్రజలు మనిషిగా కూడా గుర్తించలేదు

● ఎక్స్‌లో నెట్టెం ఘాటు విమర్శలు

జగ్గయ్యపేట, జూన్ 18 : వైఎస్ జగన్ ఓడిపోయాక ప్రజాస్వామ్యం, ప్రజా స్వామ్య విలువలు గుర్తొచ్చాయా అని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం ఎక్స్‌లో ఘాటుగా స్పందించారు. ప్రజలు కనీసం జగన్‌ను మనిషిగా కూడా లెక్కేయటం లేదని, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని మనిషిగా మారతారని ఆశిస్తున్నానని తీవ్రంగా విమర్శించారు. వైఎస్ జగన్ ఈవీఎంల ట్యాంపరింగ్, ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య విలువలు వ్యాఖ్యానించటంపై నెట్టెం ఫైవిధంగా స్పందించారు.

మాజీ మంత్రి ఉమాతో రవీంద్ర భేటీ



గొల్లపూడి : గొల్లపూడి పార్టీ కార్యాలయంలో మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రవీంద్రను ఉమా ఘనంగా సత్కరించారు. నర్రా వాసు పాల్గొన్నారు.

కాకులపాడు చానల్‌లో స్వచ్ఛందంగా పూడికతీత

● కాకులపాడు, కానుమోలు, దంటగుంట్ల రైతుల చొరవ
● కాకులపాడు రైతు పూర్ణబ్రహ్మయ్య సహకారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 18 : గత ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెత్త, గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలతో పూడుకుపోయిన సాగునీటి కాలువలను రైతులే చందాలు వేసుకుని స్వచ్ఛందంగా పూడికతొలగించుకుంటున్నారు. కాకులపాడు, కానుమోలు, దంటగుంట్ల, తదితర గ్రామాలకు చెందిన రైతులతో పాటు చలసాని పూర్ణబ్రహ్మయ్య సహకారంతో కాకులపాడు చానల్‌లో పూడికతీత పనులు మంగళవారం మొదలుపెట్టారు. సర్పంచ్ కాజ ప్రసాద్, చలసాని శ్రీనివాస్, తదితరులు ఎక్స్‌కవేటర్‌కు పూజలు చేసి పూడికతీత, ముళ్లపొదల తొలగింపు చేపట్టారు. సాగుకు సమాయత్తమవుతున్న తరుణంలో ప్రధాన కాలువలన్నీ పూడుకుపోవడంతో రైతులే స్వచ్ఛందంగా కాలువ పూడికతీత పనులు చేపట్టారు. కాకులపాడు చానల్ ద్వారా తొమ్మిది గ్రామాలకు తాగునీరు, 4329 ఎకరాలకు పైగా సాగునీరు అందుతుందన్నారు. ఏప్రిల్‌లో అధికారుల దృష్టికి పూడిక సమస్యను తీసుకువెళ్లి తామే బాగుచేసుకుంటామని అడిగినా ఎన్నికల య్యేంతవరకూ కుదరదని అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చలసాని శ్రీనివాస్, లింగం నవీన్, నాగేశ్వరరావు, కామినేని హరిబాబు, ఎలీషా, తోట రంగారావు, తాడంకి దాసు, యజ్జవరపు శ్రీనివాసరావు, కురిమి శ్రీనివాసరావు, మున్నంగి శేషగిరిరావు, ముప్పాళ్ల శంకరావు, పడకల వెంకట్రామయ్య, తిపిర్నేని సత్యన్నారాయణ, వీరవపనేని రాజా, వెలగపూడి నాసరయ్య తదితరులతో పాటు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



సాగునీటి కాల్వలోని గుర్రపు డెక్కను స్వచ్ఛందంగా తొలగిస్తున్న రైతులు

సాగునీటి కోసం యుద్ధాలు చేయాల్సి వచ్చింది.



కాకులపాడు చానల్ ద్వారా రంగయ్యప్పారావుపేట, కాకులపాడు తదితర తొమ్మిది గ్రామాలకు సాగు, తాగునీరందుతుంది. పూడిక వల్ల సాగునీరందక అధికారులతో యుద్ధాలు చేయవలసివచ్చింది. గతంలో రెండుసార్లు కాకులపాడు చానల్‌కు నీరు వదిలే విషయమై డీఈ కొడాలి బాబుతో గొడవకూడా పడ్డాం. పోలీసుల కేసులకు కూడా బెదరక పోరాడితేనే సాగునీరందింది. కాలువ బాగుచేతకు సహకరించిన చలసాని పూర్ణబ్రహ్మయ్య, ఇతర రైతులకు కృతజ్ఞతలు.

- కాజ ప్రసాద్, సర్పంచ్



సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

సీఎం చంద్రబాబును కలిసిన ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 18 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సచివాలయంలోని ఆయన చాంబర్‌లో మంగళవారం ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి మంత్రి కొల్లు రవీంద్ర మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలియజేసి, జిల్లాలోని రాజకీయ పరిస్థితులపై సమీక్షించారు.

ఏజీగా రెండోసారి దమ్మాలపాటి

● కంచికచర్లలో హర్షాతిరేకాలు



కంచికచర్ల, జూన్ 18: కంచికచర్ల పట్టణానికి చెందిన సీనియర్ అడ్వకేట్ దమ్మాలపాటి శ్రీనివాస్ ఏపీ రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. సీఎం నారా చంద్రబాబు నాయు డు ఆదేశాల మేరకు శ్రీనివాస్‌ను ఏజీగా నియమిస్తూ సీఎంవో మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రైతు కుటుంబానికి చెందిన ఆయన 1965 జూన్ రెండున జన్మించారు. తల్లిదండ్రులు దమ్మాలపాటి నాగేశ్వరరావు - విజయ. ప్రాథమిక విద్య కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభ్యసించారు. విజయవాడ సిద్ధార్థ కళాశాలలో డిగ్రీ చదివిన ఆయన సిద్ధార్థ లా కళాశాలలో ఎల్‌ఎల్‌బీ డిగ్రీ పట్టా పుచ్చుకున్నారు. 1991లో ఉమ్మడి హైకోర్టు బార్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్‌మెంట్ అయ్యారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో 2014 నుంచి 2016 వరకు అదనపు అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. దమ్మాలపాటి రెండోసారి అడ్వకేట్ జనరల్‌గా నియమించటం పట్ల కంచికచర్ల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎంపీ కేశినేని చిన్నికి గన్నవరం టీడీపీ నేతల సత్కారం

గన్నవరం, జూన్ 18 : విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల పరిశీలకులు వి.హరిబాబునాయుడు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, తుమ్మల జగదీష్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హరిబాబు నాయుడును కేశినేని చిన్ని సత్కరించారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముని కూడా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

టమోటా ధరల అదుపునకు చర్యలు

కృష్ణలంక, జూన్ 18 : టమోట ధర అదుపునకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొరుగు రాష్ట్రాలలో టమోట సాగు లేకపోవడం, వర్షాల ప్రభావం వలన టమోట ధర పెరిగిందన్నారు. గత పదిరోజుల్లో చిత్తూరు, అన్నమయ్య జిల్లాలోని మార్కెట్‌ల నందు సుమారు 30 టన్నుల టమోట కొనుగోలు చేసి గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోని రైతు బజార్లలో కొనుగోలు ధరలకే అమ్మటం జరిగిందన్నారు. టమోటా కొనుగోలుకు ప్రతిజిల్లాకు రూ.5 లక్షలతో రివాల్వింగ్ ఫండ్ అందుబాటులో ఉంచామన్నారు.

సీటు వదల!

(5వ పేజీ తరువాయి)

గ్రామీణ మండలాల తహశీల్దార్లు జగనన్న ఇళ్ల పేరుతో భూములు కొనుగోలులో భారీగా అవినీతికి పాల్పడ్డారు. సీసీఎల్ఏలో కూడా తమకు సన్నిహితంగా ఉన్న అధికారులతో కలిసి ప్రభుత్వ చెరువులను కూడా సాగు చేసుకుంటున్నట్టుగా అడ్డగోలుగా పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చేశారు. ఆయా గ్రామీణ మండలాల పరిధిలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారు.

గత తహసీల్దార్లు అడ్డగోలుగా సంపాదించిన ఉదంతాలను చూసిన ఇతర జిల్లాల తహసీల్దార్లు విజయవాడ గ్రేటర్ పరిధిలోని పలు గ్రామీణ మండలాల నుంచి కదలటానికి ఇష్టపడటం లేదు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సందర్భంలో కీలకమైన అంశాల జోలికి వెళ్లకూడదు. ఉండేది స్వల్ప కాలమే కాబట్టి.. ఆ తర్వాత సొంత జిల్లాకు చెందిన వారు వస్తారు కాబట్టి ఎన్నికల కోడ్‌ను అమలు చేసే బాధ్యతలను చూడాలి. కానీ.. విజయవాడ గ్రేటర్ పరిధిలోని గ్రామీణ మండలాలకు ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు అడ్డగోలుగా వైసీపీ నేతలకు మట్టి, గ్రావెల్, ఇసుక తవ్వేసుకోమని అభయ హస్తం అందించారు.

ఎన్నికల కోడ్‌లోనూ అక్రమ క్వారీయింగ్‌కు అనుమతి

ఎన్నికల కోడ్‌లో కూడా అక్రమ క్వారీయింగ్ ఆగలేదు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయం, ఆందోళన ఉన్న వైసీపీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో, నాయకుల కనుసన్నల్లో అడ్డగోలుగా అక్రమ క్వారీయింగ్‌కు రెవెన్యూ తహసీల్దార్లు సహకరించారు. ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లకుండా ఉండటానికి అర్ధరాత్రుళ్లు తవ్వుకోమని రెవెన్యూ తహసీల్దార్లే వైసీపీ నేతలకు సహకరించారు. కృష్ణా తీరప్రాంతం కలిగిన మండలాల్లో అనధికారికంగా ఇసుక తవ్వకోటానికి అనుమతులు ఇచ్చారు. తమ్మిలేరు, కట్టలేరులను కలిగిన మండలాల తహసీల్దార్లు అయితే వైసీపీ నేతల ఇసుక దోపిడీకి సహకరించారు. పోలవరం కాలువ సాగే మండలాల పరిధిలో అయితే కాలువగట్టు మట్టిని తవ్వుకోవటానికి సహకరించారు. గ్రావెల్ నిక్షేపాలు కలిగిన మామిడితోటల్లో కూడా 50 మీటర్ల భూగర్భంలోకి తవ్వుకునేందుకు మరీ సహకరించారు.

ప్రతి ఫైల్‌కు రేటు కట్టి వసూలు

కొంతమంది తహసీల్దార్లు ఆర్‌ఐలతో లాలూచీ పడి మ్యుటేషన్ల ఫైల్స్ గుట్టుచప్పుడు కాకుండా పరిష్కరిస్తున్నారు. కొందరు తహసీల్దార్లు ఇతర జిల్లాల నుంచి వచ్చిన కొద్దిరోజుల వరకు ఆర్‌ఐలు తీసుకువచ్చే ఫైల్స్‌పై సంతకాలు పెట్టకుండా వారిని, ప్రజలను ఇబ్బందులు పెట్టారు. ఇలా కొద్దిరోజులు వ్యవహరించిన తర్వాత మనసులో మాట చెప్పి ప్రతి ఫైల్‌కూ రేటు కట్టారు. దీంతో ఆర్‌ఐలకు తప్పటం లేదు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లే కాదు.. ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన పలువురు తహసీల్దార్లు కూడా ఆయా జిల్లాల్లోని మండలాలను వదిలి రావటానికి ఇష్టపడటం లేదు.

ఆయా మండలాల్లో కూడా ఇదే విధంగా మనవాళ్లు కూడా పైరవీలు ప్రారంభించారు. సొంత జిల్లాకు రావాల్సిన తహసీల్దార్లను స్థానికంగా యథాస్థాన మండలాలకు పోస్టింగ్‌లు ఇవ్వరు. కచ్చితంగా అంతర్గత బదిలీలు ఉంటాయి. కానీ పొరుగు జిల్లాలకు వెళ్లిన మన తహసీల్దార్లు కొందరు.. ఎన్నికల ముందు తాము ఎక్కడైతే పనిచేశామో తిరిగి అదే స్థానంలో పనిచేసేందుకు పైరవీలు ప్రారంభించటం విశేషం.

ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని అవినీతిని అరికట్టడానికి, ప్రజలకు మెరుగైన సేవలందించటం కోసం తక్షణం ఎన్నికల బదిలీలపై వెళ్లిన వారిని తిరిగి సొంత జిల్లాలకు కేటాయిస్తూ వారికి స్థానభ్రంశాలను కల్పించే అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

విమానాశ్రయ భూ నిర్వాసితులకు పరిహారం

● రెవెన్యూ, విమానాశ్రయ విస్తరణ, ఆర్ అండ్ బీ అధికారులకు కలెక్టర్ ఆదేశం

మచిలీపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో మంగళవారం జేసీ గీతాంజలిశర్మతో కలసి రెవెన్యూ, విమానాశ్రయ విస్తరణ, ఆర్ అండ్ బీ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. విమానాశ్రయ అభివృద్ధిలో భాగంగా దావాజీగూడెం, బుద్ధవరం రైతులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద చినఅవుటపల్లిలో ఐదుసెంట్ల స్థలంతోపాటు రూ.9 లక్షలను పరిహారంగా కొంతమంది రైతులకు ఇప్పటికే ఇవ్వడం జరిగిందన్నారు. మరికొంతమందికి పరిహారం ఇవ్వాల్సి ఉందని త్వరితగతిన అందించాలని అధికారులను ఆదేశించారు. విమానాశ్రయ అభివృద్ధికి ప్రైవేట్ వెంచర్‌ల యజమానులు భూమిని ఇచ్చారని, వారికి అల్లంపూడిలో భూ మికి బదులుగా భూమి ఇచ్చేందుకు, లే అవుట్ అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ఏపీ సీఆర్‌డీఏ అధికారులకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. విమానాశ్రయం సమీపంలోని ఏలూరుకాల్వపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. విమానాశ్రయంలోని పరిస్థితులను పరిశీలన చేసేందుకు తాను త్వరలో వస్తానని కలెక్టర్ తెలిపారు. విమానాశ్రయం డైరెక్టర్ ఎంఎల్‌కె రెడ్డి, గుడివాడ ఆర్డీవో పి పద్మావతి, గన్నవరం తహసీల్దార్ ఎస్ఎస్ పవన్ కుమార్, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృష్ణా డీకే బాలాజీ

దసరా లక్ష్యంగా..!

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. ఐదంతస్థుల్లో కేశన ఖండనశాల నిర్మాణం చేపట్టాలన్నది అధికారుల ప్రతిపాదన.

● **కొండచరియలు జారిపడకుండా..**

అమ్మవారు కొలువుదీరిన ఇంద్రకీలాద్రి కొండ నుంచి రాళ్లు జారి పడటం తరచూ జరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని భక్తుల భద్రత కోసం భద్రతాచర్యలను దుర్గగుడి అధికారులు చేపట్టారు. బెంగళూరు నుంచి రాక్ ఫాల్ మిటిగేషన్ బృందాన్ని తీసుకొచ్చి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధ్యయనం చేసి వారి సూచనల మేరకు ఇప్పటికే రూ.4.25 కోట్ల వ్యయంతో భద్రతా పనులు పూర్తి చేశారు.

● **పార్కింగ్ సమస్య పరిష్కరించేందుకు..**

దుర్గగుడి చెంత భక్తులు తమ వాహనాలను ముఖ్యంగా కార్లను పార్కింగ్ చేసుకోవడం పెద్ద సమస్యగా మారింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని కనకదుర్గనగర్ ప్రవేశం చెంత మల్టీలెవల్ కార్ పార్కింగ్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను అధికారులు సిద్ధం చేశారు. సుమారు రూ.33 కోట్లతో తయారు చేసిన ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే 400 కార్ల పార్కింగ్‌ను అతి తక్కువ స్థలంలో పార్కు చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. ప్రస్తుతం ఈ విధానం జనసమ్మర్ధంగా ఉండే నగరాల్లో అమల్లో ఉంది.

● **దసరా నాటికి పూర్తి చేయడమే లక్ష్యం**

దుర్గగుడిలో పలు అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచనలతో వీటిని అక్టోబరు నాటికి పూర్తి చేయాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. దసరాలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించే లక్ష్యంతో పని చేస్తున్నాం.

- కేఎస్ రామారావు, దుర్గగుడి ఈవో

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.85

వీకేఆర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా రేపు

గన్నవరం, జూన్ 18 : గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న వీకేఆర్ కళాశాలలో ఈ నెల 20న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంపినాస్ సుంగ్‌వూ హైటెక్, హ్యుందాయ్, మోబీస్ యాక్ట్, ఆలస్టమ్, డైకిన్ డెక్కన్ డిక్, ఫాక్స్‌కాన్ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, నిట్, ఐసీఐసీ బ్యాంక్, ఇంఫిలిమ్ రాక్‌మ్యాన్, డిక్సన్, సియోన్ ఈ-హెచ్‌డబ్ల్యుఏ సమ్మిట్ కంపెనీలలో జాబ్‌ల కోసం ఆరోజు ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ఎన్‌టీటీఎఫ్ వంటి కోర్సులు చేసిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు.

బస్టాప్ వద్ద మద్యం దుకాణం!

- అక్కడే మద్యం సేవిస్తున్న మందుబాబులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- బస్టాప్‌కు అడ్డుగా ఆటోలు
- పట్టించుకోని పోలీసులు



ఉయ్యూరు సెంటర్‌లో బస్టాప్ వద్ద మద్యం దుకాణం

ఉయ్యూరు, జూన్ 18 : ఉయ్యూరు పట్టం ప్రధాన సెంటర్ సమీపాన విజయవాడ బస్‌స్టాప్ వద్ద ఉన్న మద్యం షాపు ప్రయాణికులకు ఇబ్బంది కరం, అసౌకర్యం కలుగుతుంది. బస్‌స్టాప్ వద్ద బస్సులు నిలిపే స్థలం వద్ద గతప్రభుత్వం మద్యం షాపు ఏర్పాటుచేసింది. మద్యంషాపునకు వచ్చిపోయే మందుబాబులతో పాటు అక్కడే నిలబడి మద్యం సేవించే వారితో ఆప్రాంతం మందుబాబులకు నిలయంగా తయారవడంతో బస్సుల కోసం వేచి ఉండేందుకు వీలులేక ప్రయాణికులు దూరంగా నిలబడాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నారు. బస్సులు నిలపాలిసిన స్థలంలో మందుబాబులు, ఆటోలతో ఖాళీ లేక పోవడంతో బస్సుస్టాపుకు దూరంగా ఆపడంవల్ల ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలకు అసౌకర్యం కలుగుతుంది. ఆటోలను నిలువరించాల్సిన పోలీసులు పట్టనట్టు వ్యవహరిస్తుండంతో ప్రయాణికు లు ఇబ్బంది పడుతున్నారు. బస్‌స్టాప్‌వద్ద ఉన్న మద్యం షాపు మరో చోటుకి తరలించాలని మహిళలు అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా గత ప్రభుత్వంలో పట్టించుకున్న వారులేరని, నూతనంగా ఏర్పడిన ప్రభుత్వమైనా స్పందించి తగుచర్యలు తీసుకోవాలని మహిళా ప్రయాణికులు కోరుతున్నారు.

కానూరులో డ్రెయిన్ల పూడికతీత పనుల పరిశీలన


పూడికతీత పనులు పరిశీలిస్తున్న కమిషనర్

పెనమలూరు, జూన్ 18 : కానూరు గ్రామానికి ప్రధాన సమస్యగా మారిన డ్రెయిన్ల పూడిక తీత పనులను మంగళవారం తాడిగడప మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పరిశీలించారు.

● ఈ నెల 23 నుంచి పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తాడిగడప మునిసిపాలిటీలోని పోరంకి, కానూరు, తాడిగడప, యనమలకుదురు సర్కిళ్ల ప్రజలతో ముఖాముఖి నిర్వహించనున్నారని తాడిగడప మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. సర్కిళ్లకు చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం తమ అర్జీలను పోరంకి ద్వారకా రెసిడెన్సీలో అందజేయాలని, ఆ రోజు తొమ్మిది గంటల నుంచి సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్టు

కంకిపాడు, జూన్ 18 : మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో చోరీలకు పాల్పడిన పలువురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై డి. సందీప్ చెప్పారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై సందీప్ మాట్లాడుతూ, ఈడుపుగల్లులోని పలు షాపుల్లో పలువురు చోరీలకు పాల్పడ్డారన్నారు. ఈ క్రమంలో వణుకూరుకు చెందిన గోగులమూడి విద్యాసాగర్, పల్లి వికాస్, దొడ్డా మహేష్ బాబులను అదుపులోకి తీసుకొని విచారించామని, దీంతో చోరీలకు పాల్పడినట్లు వీరు అంగీకరించారని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై - 2 తాతాచార్యులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రకు వైవీబీ శుభాకాంక్షలు


మంత్రి రవీంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైవీబీ, గురుమూర్తి, టీడీపీ నాయకులు

ఉయ్యూరు, జూన్ 18 : సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి మచిలీపట్నం అభ్యర్థిగా ఘన విజయం సాధించి ఎక్సైజ్, గనుల శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొల్లురవీంద్రకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్ర సాద్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలో మంగళవారం కొల్లు రవీంద్రను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ నగర సాధికార రాష్ట్ర కన్వీనర్ జంపన వీరశ్రీనివాస్, మైనారిటీ సెల్ కార్యదర్శి అజ్మతుల్లా, బీసీ సెల్ కార్యదర్శి రాజులపాటి ఫణి, యువనాయకుడు వల్లూరి కిరణ్, పవన్, దుర్గాప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 18 : జాతీయ రహదారిపై వెళ్తున్న ఆటోను వెనుక నుంచి ఆర్టీసీబస్సు ఢీకొన్న ఘటన మంగళవారం వీరవల్లి బైపాస్‌పై జరిగింది. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌జంక్షన్ నుంచి విజ యవాడ కూరగాయలతో వెలుతున్న ఆటోను జంగా రెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో పల్టీకొట్టి రోడ్డుపై పడిపోగా అందులోని కూరగాయలు చెల్లాచెదురయ్యాయి. ఆటో నడుపుతున్న బండారు గూడెంకు చెందిన సముద్రపు నాగేంద్ర బాబుకు గాయాలయ్యాయని వివరించారు. ఆటో డ్రైవరు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

మంత్రి పార్థసారథికి ఎంపీ కేశినేని చిన్ని సత్కారం


మంత్రి పార్థసారథిని సన్మానిస్తున్న తెలుగు యువత నాయకులు

పెనమలూరు, జూన్ 18 : రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కొలుసు పార్థసారథిని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం తాడిగడప వందడుగుల రోడ్డులోని మంత్రి పార్థసారథి కార్యాలయంలో మంత్రిని కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘురాం, టీడీపీ సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, ఎంపీ రాజకీయ కార్యదర్శి నరసింహ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : నూజివీడు టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో విజయం సాధించి కూటమి ప్రభుత్వంలో గృహనిర్మాణ, సమాచార, పౌరసంబధాల శాఖ మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన కొలుసు పార్థసారథికి తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, ఇతర నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు.

ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 18 : బాపులపాడు మండలంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. వేలేరు తండాలోని బాణావతు శ్రీను, రాము, బాణావతు కమలకుమారి తదితరులకు చెందిన సుమారు 13మందికి చెందిన ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. కొన్ని చోట్ల సిమెంటు రేకులు లేచిపోయి విరిగిపడిపోయాయి. పెరికీడు, కానుమోలు వద్ద విద్యుత్ మెయిన్ లైన్లు వరిగిపోవడంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది. కాకులపాడు, ఆరుగొలను తదితర గ్రామాల్లో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.


విద్యార్థినులకు నోటు బుక్స్ అందజేసిన నాగ ప్రసాద్

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గన్నవరం, జూన్ 18 : దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుస్సే నాగ ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో విద్యార్థినులకు షిర్డీ నాగసాయి విజయదుర్గ హరహర బాలాజీ సేవా ట్రస్ట్ వారి సౌజన్యంతో 300 నోట్ బుక్స్, వంద పెన్నులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా నాగ ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. అప్పుడే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కళాశాల అధ్యాపకులు మోహిని కృష్ణకుమారి, పద్మజ ఉమాదేవి, సుబ్రమణ్యం, రాము, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారాన్ని..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పిల్లా అనిత సూచించారు. వీరవల్లి హైస్కూల్ హెచ్‌ఎం నిర్మల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలందిస్తామని గుండపనేని ఉమా వరప్రసాద్, లంక సురేంద్రమోహన బెనర్జీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఉపసర్పంచ్ లంక అజయ్, ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, మండాది రవీంద్ర, పేరెంట్స్ కమిటీ సభ్యుడు అలుగుల దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

● వైభవంగా అంగన్‌వాడీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్‌డే

వీరవల్లి శాలివాహన కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నర్సరీ పూర్తి చేసిన చిన్నారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తు గ్రాడ్యు యేషన్‌డేను వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ పిల్లా అనిత, ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ పాల్గొని చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం భగీరథ, అంగన్‌వాడీ వర్కర్లు రమాదేవి, సుహాసిని, హేమలత తదితరులతో పాటు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించండి

కంకిపాడు, జూన్ 18 : పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్షాకాలం లో వాతావరణం మార్పులు కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతుంటారన్నారు, పారిశుధ్య సమస్యలు లేకుండా పంచాయతీ అధికారలు తగు చర్యలు చేపట్టాలన్నారు. వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆర్టీసీ మేనేజర్ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాల ప్రజ లకు అవసరమైన సమయాల్లో బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని ఆర్టీసీకి సంబంధించిన అధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనూష తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి తిరుకల్యాణోత్సవం


స్వామి కల్యాణోత్సవంలో త్రిదిండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి

పెనమలూరు, జూన్ 18 : పోరంకి లక్ష్మీపురం కాలనీలోని పద్మావతి గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 16 ఆదివారం నుంచి 20 వ తేదీ వరకు నిర్వహిస్తున్న వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారి తిరుకల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. త్రిదిండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో తిరు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని కనులార వీక్షించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పందిపాటి ఇందిర

ఈడుపుగల్లు (కంకిపాడు), జూన్ 18 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. కంకిపాడు జిల్లా పరిషత్ పాఠశాల్లోని విద్యా ర్థులకు మంగళవారం ఆమె పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ ఇందిర మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నాణ్యమైన విద్యనందిస్తుందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఉపాధ్యాయులను ఈ ప్రభుత్వం ఇబ్బందులు పాలు చేయదన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారిని ఉన్నతశిఖరాలకు తీసుకువెళ్లాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిలారు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, వార్డు సభ్యులు షేక్ షకార్, అనుమోలు రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడికిపంపాలి

హనుమాన్‌జంక్షన్ : బడి ఈడు పిల్లలందరిని సర్వే చేసి ఏ ఒక్క బడి ఈడు పిల్లవాడు బయట తిరగకుండా అందర్నీ బడికి రప్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని బాపులపాడు ఎంపీడీవో కె.రత్నకుమారి ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో నేను బడికిపోతా కార్యక్రమం కార్యాచరణపై పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈవో రాంబాలసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ, జూలై 12 వతేదీ వరకు బడిఈడు పిల్లలపై సర్వే చేసి అందరిని బడిలో చేర్పే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో -2 సురేష్‌కుమార్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జన్మదిన వేడుకలు


బోడె ప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పెదపులిపాక టీడీపీ నాయకులు.. ముదునూరులో..

పెనమలూరు, జూన్ 18 : పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, నాయకులు ఉదయాన్నే పోరంకిలోని టీడీపీ కార్యాలయానికి వచ్చి బోడె ప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాడిగడపలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పెదపులిపాక టీడీపీ నాయకులు ముసునూరి శ్రీనివాసరావు, ముసునూరి శ్రీధర్, గుజ్జర్లపూడి బాబూరావు, గుంటూరు విశ్వేశ్వరరావు, అలపాటి మోహనరావు, ఆలూరి యుగంధర్, గుండిమెడ నాగమధు, గుజ్జర్లపూడి చందులు బోడె ప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీవీవీఆర్ చారిటబుల్ ట్రస్టు తరపున యార్లగడ్డ రాజబాబు మొక్కలు నాటేందుకు బోడె ప్రసాద్‌కు లక్ష రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అను మోలు ప్రభాకరరావు, తోటకూర సుబ్బారావు, ఆచంట వెంకట చంద్ర, కొమ్మినేని వెంకటేష్, తుమ్మల రాంకుమార్, రంజిత్, దోనేపూడి రవికిరణ్, అంగిరేకుల మురళి, కోయ ఆనంద్‌ప్రసాద్, ఘారుపూడి ధనకోటేశ్వరరావు, మన్నె వాసు, బొంగరాల అబ్రహం, వల్లభనేని నాని, దండమూడి చౌదరి, వేమూరి శ్రీనివాస్, వెనిగళ్ల కుటుంబరావు, సూదిమళ్ల రవీంద్ర, జంపన గుర్నాధం తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను సత్కారిస్తున్న తుమ్మలపల్లి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు

వాటర్ ట్యాంకు వితరణ



ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జన్మదినం సందర్భంగా యనమలకుదురు గ్రామానికి చెందిన వడ్లమూడి కోటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు షుమారు మూడున్నర లక్షల విలువైన వాటర్ ట్యాంకరును గ్రామ టీడీపీ నాయకులు మొక్కపాటి శ్రీనివాసరావుకు అందించారు.

కంకిపాడు : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమం కోసం పాకులాడే ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మరిన్ని జన్మదిన వేడుకలను జరుపుకోవాలని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జన్మదిన వేడుకలను మంగళవారం టీడీపీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జన్మదిన వేడుకలను తెన్నేరులోని టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పాఠశా లలోని విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెన్నేరు గ్రామ పార్టీ అధ్యక్షులు ఉద్దండి కుటుంబరావు, యలమంద, నాని తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పుట్టిన రోజు వేడుకలు ఉయ్యూరు, ముదునూరు ఇతర గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముదునూరులో పార్టీ సీనియర్ నాయకుడు పాలడుగు బాలాజీ ఆధ్వర్యంలో గ్రామ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మల రామకోటయ్య, తెలుగు మహిళా అధికార ప్రతినిధి పాలడుగు మాధవీలత, పామర్తి సుబ్బమ్మ కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు.

● జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కేక్ కట్‌చేసి విద్యార్థులకు స్వీట్లు పంచారు. సర్పంచ్ నాగ వెంకటలక్ష్మి, మాజీసర్పంచ్ శేఖర్, పల్లపోతు శ్రీనివాసరావు, నక్కా నాని, జనసేన నాయకుడు దాకారపు అజయ్‌బాబు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ పాలడుగు సత్యనారాయణ బోడె ప్రసాద్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.85

అక్రమ లేఅవుట్ ధ్వంసం చేసిన సీఆర్డీఏ

తాడంకి(పమిడిముక్కల), జూన్ 18 : తాడంకి గ్రామ పంచాయతీ పరిధిలో అనధికార లేఅవుట్‌ను సీఆర్డీఏ అధికారులు మంగళవారం ధ్వంసంచేశారు. గ్రామంలో 150/1బీ సర్వే నెంబరులో 2.65 ఎకరాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్ వేసి విక్రయిస్తున్న వారిపై జిల్లా రిజిస్ట్రార్ తగు చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త రాష్ట్ర లోకాయుక్తకు గతంలో ఫిర్యాదు చేశారు. ఆమేర లేఅవుట్‌లో రోడ్డును సీఆర్డీఏ అధికారులు ధ్వంసం చేశారు.



తాడంకి పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్ రోడ్డు ధ్వంసం

పంటకాలువల ఆక్రమణ - పట్టించుకోని అధికారులు

నందివాడ (అరిపిరాల), జూన్ 18 : చేపల చెరువులు మరమ్మతులు అంటూ తవ్వకాలకు అనుమతులతో పని లేకుండా ఇష్టారాజ్యంగా చేపల చెరువుల తవ్వకాలు జరుపుతున్నారు. కాల్వ గట్టుకు, చేపల చెరువు గట్టులకు కనీసం మూడు మీటర్లు దూరంగా ఉండాలన్న నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా కాల్వలకు తూములు వేసి మరీ దారి ఏర్పర్చుకుంటున్నారని అరిపిరాల, పొలాసివారిపాలెం గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అరిపిరాల నుంచి పోలాసివారిపాలెం పంచాయతీ చెరువులకు ఈ పంట కాల్వల ద్వారా నీళ్ల రావాలి. కానీ చేపల చెరువుల యజమానులు వాటిని పూడ్చి వేయటంతో తూముల ద్వారా నీళ్ల రావటం నామమాత్రమేనని గ్రామస్థులు వాపోతున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికా రులు ఎవరు వీటి వంక చూడటంలేదని ఆరోపిస్తు న్నారు. ఒకవేళ తెలిసినా కాసుల మత్తులో మాకు ఏమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు. తమ సమస్యను ఎవరి దృష్టికి తీసుకెళ్లాలో తెలియక గ్రామస్థులు అయోమయానికి గురవుతున్న పరిస్థితి. ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపి ఈ చేపల చెరువుల యజమా నుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాలువకు అడ్డంగా పెట్టిన తూములు

నేడు మెగా జాబ్‌మేళా

చల్లపల్లి, జూన్ 18 : చల్లపల్లి వివేకానంద డిగ్రీ కళాశాలలో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్ తెలిపారు. ఉదయం 9 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు వారి సర్టిఫికెట్ జిరాక్సులతో హాజరు కావాలన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయసున్న వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

గుడివాడ: జగన్నాథపురంలో వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు అప్పలాచారి తెలిపారు. దేవస్థానంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణ ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.

రేపటి నుంచి అంకాలమ్మ, పోతురాజు స్వామి జాతర

అవనిగడ్డ రూరల్, జూన్ 18 : వేకనూరులోని మాదివాడ అంకాలమ్మ, పోతురాజు స్వామి వార్షిక జాతర మహోత్సవాలు ఈ నెల 20 నుంచి 22 వరకు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 20న స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చన పూజ, 21న అంకాలమ్మ జాతర, 22న ముగింపు కార్యక్రమాలు జరిగుతాయన్నారు.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నేత జేమ్స్ మృతి

గుడివాడ : బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, జనసేన నాయకుడు జేమ్స్ మంగళవారం గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగవరప్పాడులోని జేమ్స్ స్వగృహంలో రాజకీయ, కార్మిక సంఘాల నాయకులు, సందర్శించి నివాళ్ళులర్పించారు.

లంక భూములకు పట్టాలివ్వండి

ఘంటసాల, జూన్ 18 : పాపవినాశనం గ్రామం కృష్ణానది వరద ముంపు లంక భూములకు పట్టాలిచ్చి, కరెంట్ సౌకర్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండా దుర్గారావు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం రైతులతో కలసి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సి.హెచ్.సుధీర్, జిల్లా నాయకుడు జక్కుల నెలబాలుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, డొక్కు ప్రభాకర్ పాల్గొన్నారు.

అనధికార ఫ్లెక్సీలను తొలగించండి

భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకుడు మురళీకృష్ణ నిరసన

గుడివాడ : పట్టణంలో ఏర్పాటు చేసిన అనధికార ఫ్లెక్సీలను తొలగించాలని కోరుతూ భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకుడు వై.వి.మురళీకృష్ణ మార్కెట్ సెంటర్‌లోని మూడెడ్ల రామారావు చౌక్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. పర్యావరణానికి హానికరమని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని, దానిని అమలు చేయాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా వాటిని ఏర్పాటు చేస్తున్నారని, వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు ఫ్లెక్సీలను తొలగించారు.

గోవధకు పాల్పడ వారిపై చర్యలు తీసుకోవాలి

బంటుమిల్లి, జూన్ 18 : బక్రీద్ సందర్భంగా పెడనలో జరిగిన గోవధకు పాల్పడిని వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు మంగళవారం వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, శివశక్తి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. గోవధ చట్టాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఆవులను అమ్మినవారిని, కొన్న వారిని గోవధ చట్టం ధిక్కా రణ కింద విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, శివశక్తి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెడన ఎమ్మెల్యే కాగితను కలిసిన వల్లభనేని సందీప్

బంటుమిల్లి, జూన్ 18 : పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలశౌరి కుమారుడు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన కాగిత కృష్ణప్రసా ద్‌కు జనసేన నాయకులు వల్లభనేని సందీప్‌తో పాటూ మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని పలు వురు నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ర్యాలీ సత్యనారాయణ, ఇతర జనసేన నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను అభినందిస్తున్న వల్లభనేని సందీప్

రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి

ఘంటసాల, జూన్ 18 : కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత అన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత నిధి విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని కేవీకే సమావేశ మందిరంలో రైతులకు చూపించారు. పీఎం కిసాన్‌ముఖ్య ఉద్దేశ్యం, రైతులు దీనిని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి, ఖరీఫ్ వ్యవసాయ పనుల సూచనలు, విత్తనశుద్ధి, ఇతర పనుల గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

చిన్నాపురం రైతులకు అనుకూలంగా తీర్పు

మచిలీపట్నం టౌన్, జూన్ 18 : బందరు మండలం చిన్నాపురం రైతులకు న్యాయస్థానం ద్వారా రూ. 12 లక్షలు చెల్లించేలా జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి దేవిశ్రీవాణి మంగళవారం తీర్పు ఇచ్చారు. 2020లో చిన్నాపురం కేడీసీసీ బ్యాంకు శాఖ రైతులకు రూ. 12 లక్షల రుణ మాఫీ చేయవలసి ఉంది. అయితే ఆ మొత్తాన్ని సెంట్రల్ బ్యాంకు అందించలేదని నాలుగేళ్ల క్రితం రైతులు లోక్ అదాలత్‌లో కేసులు దాఖలు చేశారు. దీనిపై పర్మినెంట్ లోక్ అదాలత్ రైతులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ బ్యాంకు అధికారులు హైకోర్టులో అప్పీల్ చేశారు. అయితే హైకోర్టులో కూడా రైతులకు అనుకూలంగానే తీర్పు వచ్చింది. మళ్ళీ బ్యాంకు అధికారులు సుప్రీం కోర్టుకు వెళ్ళగా, సుప్రీం కోర్టు కూడా రైతులకు అనుకూలంగానే తీర్పు ఇచ్చింది. బ్యాంకు పర్నీచర్‌ను జప్తు చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీంతో మంగళవారం బ్యాంకు అధికారులు అందించాల్సిన సొమ్మును కోర్టులో జమ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది లంకిశెట్టి బాలాజీ రైతుల తరఫున కేసును వాదించారు.

అవనిగడ్డలో భారీ వర్షం

అవనిగడ్డ, జూన్ 18 : అవనిగడ్డలో మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దాదాపు గంటకుపైగా మంగళవారం కురిసిన వర్షంతో అవనిగడ్డ జూనియర్ కళాశాల ఆవరణ నీటితో నిండిపోగా, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది.

విరిగిన విద్యుత్ స్తంభం

ఘంటసాల : పాపవినాశనం గ్రామంలోని దళితవాడలో మంగళవారం వీచిన గాలులకు తాడిచెట్టు విరిగి విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. అదే సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపో వడంతో ప్రాణాపాయం తప్పింది. తెలుగురావుపాలెం గ్రామ శివారులోని ప్రధాన రహదా రిలో భారీ వృక్షం పడిపోయింది. దీంతో స్పందించి ఆయా శాఖల అధికారులు చెట్టును తొలగించి రాకపోకలకు మార్గం సుగమం చేశారు. శ్రీకాకుళంలో పలు చోట్ల చెట్లు పడిపోయాయి.



జనసేన టీచర్ల సంఘం ఆవిర్భావంపై చర్చలు

మచిలీపట్నం టౌన్, జూన్ 18 : రాష్ట్రస్థాయిలో జనసేన టీచర్ల సంఘం ఏర్పాటుకు పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మచిలీపట్నం జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రామకృష్ణను జనసేన టీచర్ల ఫెడరేషన్ నాయకులు అప్పికట్ల వెంకట రామాంజనేయులు, శివప్రసాద్, శివ, గంగాధర్, నాగార్జున తదితరులు కలిసి చర్చలు జరిపారు. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు.



బండి రామకృష్ణను కలిసిన ఉపాధ్యాయులు

టీచర్ల పీఎఫ్ జమపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్, జూన్ 18 : ఉపాధ్యాయుల ఖాతాల్లోకి 2022 అక్టోబర్ నుంచి పీఎఫ్ నిధులు జమ కావడంలేదని, దీంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని ఫ్యాప్టో నాయకులు కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందజే శారు. కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి, నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ బి. లంకేశ్వ రరావు, ప్రధాన కార్యదర్శి డి. అశోక్ కుమార్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ బి. కనకారావు, అంబటిపూడి సుబ్రహ్మణ్యం, జె. లెనిన్‌బాబు, కె. మాధవరావు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీచర్లు

స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 18 : మచిలీపట్నంలో పలు ప్రాంతాల్లో కుళాయిల్లో తాగునీరు కలుషితంగా రావడంపై నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజుతో మంగళ వారం గొర్రెపాటి గోపీచంద్ సమీక్షించారు. కుళాయిల లీకేజీల కారణంగా పలు ప్రాంతాల్లో తాగునీరు కలుషితంగా వస్తోందని, లీకేజీలను అరికట్టి స్వచ్ఛమైన నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని బాపిరాజును గోపీచంద్ కోరారు. లీకేజీలను అరికడతామని బాపిరాజు ఈ సందర్భంగా తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక సర్వీసు రేపు

మచిలీపట్నం టౌన్, జూన్ 18 : మచిలీపట్నం నుంచి అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసును నడుపుతున్నట్టు ఆర్టీసీ డీఎం పెద్దిరాజు తెలిపారు. 20న సాయంత్రం 5 గంటలకు మచిలీపట్నం నుంచి రేపల్లె, కాళహస్తి, కాణిపాకం, సిరిపురం మీదుగా అరుణాచలంకు 22వ తేదీకి చేరుతుందన్నారు. యాత్రీ కులు గిరిప్రదక్షిణ చేసుకున్న అనంతరం శివకంచి, విష్ణుకంచి, తిరుత్తని దర్శించుకుని 24న బస్సు మచిలీపట్నం చేరుకుంటుదన్నారు. వివరాలకు 8808807789కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

విద్యతోనే ఉన్నత స్థితి సాధ్యం

గుడ్లవల్లేరు, జూన్ 18 : సమాజంలో మనిషిని ఉన్నత స్థితికి చేర్చే శక్తి విద్యకు మాత్రమే ఉందని విశ్రాంత అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సాయిన సుశీల రావు అన్నారు. కౌతవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ఆయన ప్రతిభకు పురస్కారాల పంపిణీలో పాల్గొన్నారు. కౌతవరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 586 మార్కులు సాధించిన మను బాలాజీ జిల్లాలో తృతీయ ర్యాంక్, మండలంలో ప్రథమ ర్యాంక్ సాధించినందున ప్రశంసా పత్రంతో పాటు రూ.5000 బహుమతి అందజేశారు. అలానే సాత్విక్, హిమలత,గౌసియా బేగంలకు ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయిలు చొప్పున నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

సామూహిక లలితా సహస్ర నామ పారాయణం

మచిలీపట్నం టౌన్, జూన్ 18 : రాబర్టుసన్‌పేట రామలింగేశ్వరస్వామి, రంగనాయకస్వామి దేవాలయాల్లో కల్యాణోత్సవాల సందర్భంగా మంగళవారం మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కాశీనాధుని బాపే శ్వర శర్మ యాజ్ఞీకం నిర్వహిస్తున్నారు. కార్యనిర్వహణాధికారి బి. సుబ్బారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. రంగనాయక స్వామి దేవాలయంలో సువాసినులు భగవద్గీత పారాయణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి. గోపాలరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 18 : మచిలీపట్నంలో ప్రజలకు మెరుగైన పారిశుధ్యం అందించేలా చర్యలు తీసుకో వాలని 45వ డివిజన్ టీడీపీ నాయకుడు పి.వి. ఫణికుమార్ సూచించారు. మంత్రి కొల్లు రవీంద్ర దృష్టిలోకి శానిటేషన్ సమస్యలను తీసుకుని వచ్చామన్నారు. అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర శానిటేషన్ సమస్యలు లేకుండా చేయమన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.వి. రామశేఖర్, కొనకళ్ల భాను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బోడెకు టీఎన్ఎస్ఎఫ్ నాయకుల శుభాకాంక్షలు

గుడివాడ : ఎమ్మెల్యే బోడె ప్రసాద్ స్వగృహంలో మంగళవారం టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షడు నిమ్మగడ్డ సత్యసాయి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గూడూరు సురేంద్ర, సూరగాని సూరిబాబు, నిమ్మగడ్డ అరవింద్, సుంకర యువజిత్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బోడెకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

ఖరీఫ్ సీజన్‌కు అధికారులు సన్నద్ధం కావాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 18 : రానున్న ఖరీఫ్‌లో రైతులకు వరి వంగడాలు, ఎరు వులు, పురుగు మందులు అందించేందుకు తగిన చర్యలు చేపట్టాలని, జిల్లాలోని వ్యవసాయ శాఖాధికారులకు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్. పద్మావతి సూచించారు. మంగళవారం మచిలీపట్నం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పద్మావతి మాట్లాడారు. మట్టి నమూనాల పరీక్షల ఫలితాలు రైతులకు తెలియచేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట, వరి విత్తనాలు అందచేయాలన్నారు. పీఎం కిసాన్‌లో ఐదుశాతం ఫిజికల్ వెరిఫికేషన్ రికార్డులను పరిశీలించాలన్నారు. ఆర్‌బీకేల్లో రైతులకు కావలసిన ఎరువులు, పురుగుమందులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మనోహర్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మణిధర్, టెక్నికల్ ఏఓలు సురేష్, నాయక్, శాంత, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

ఎండోస్కోపి సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలి

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎండోస్కోపి సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఎంవో నిరంజన్ కుమార్‌లకు మంగళవారం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం వినతిపత్రం సమర్పించారు.

పవన్ కల్యాణ్, చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం

కోడూరు, జూన్ 18 : సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్ర పటాలకు కోడూరు మండలంలోని తూర్పు వైపున జనసేన పార్టీ నాయకులు కడవకొల్లు మల్లి ఆధ్వర్యంలో పాలాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా బాణసంచా కాల్చి ప్రజలకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన నేతలు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మొదటి సంతకంతోనే ఐదు హామీలు నెరవేర్చారని, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా పవన్ బుధవారం బాధ్యతలు తీసుకోవటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మర్రె గంగయ్య, పిట్టల్లంక సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.



తిరిగి విధుల్లోకి తీసుకోండి

బుద్ధప్రసాద్‌కు రాజీనామా చేసిన వలంటీర్ల వినతి

చల్లపల్లి, జూన్ 18 : మానవతా దృక్పథంతో తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాజీనామల చేసిన వలంటీర్లు కోరుతున్నారు. చల్లపల్లి గ్రామపంచాయతీకి చెందిన సచివాలయం 1, 2, 3 పరిధిలో రాజీనామా చేసిన వలంటీర్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. తమను బలవంతంగా రాజీనామా చేయించారన్నారు. తాము ఏ పార్టీ కార్యక్రమాలలో పాల్గొనలేదన్నారు. తమ క్లస్టర్ పరిధిలో విచారణ చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.



ఎమ్మెల్యేను కలసిన రాజీనామా చేసిన వలంటీర్లు

బుద్ధప్రసాద్‌కు సత్కారం

అవనిగడ్డ: అవనిగడ్డ ఎమ్మెల్యేగా విజయం సాధించిన మండలి బుద్ధప్రసాద్‌ను చల్లపల్లి తహసీల్దార్ బి.సుమతి మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వోలు కిరణ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్: పులిగడ్డ గ్రామస్థులు ఎమ్మెల్యే మండలి బుద ప్రసాద్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, కనకదుర్గమ్మ దేవస్థానం నిర్వాహకుడు మండలి వెంకట కృష్ణారావు (బాబు), మండలి భావన్నారాయణ పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి : ఎమ్మెల్యే వర్ల

పామర్రు, జూన్ 18 : భగవంతుడి ఆశీర్వాదంతో నియోజకవర్గ ప్రజలు, రైత న్నలు పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని వీరాంజనేయస్వామిని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా వేడుకున్నారు. కుమార్‌రాజా ఎమ్మెల్యేగా గెలవాలని పట్టణ టీడీపీ నేతలు మొక్కుకున్నారు. దానిలో భాగంగా మంగళవారం ఉండ్రపూడి -పోలవరం అడ్డరోడ్డు వద్ద గల వీరంజనేయస్వామి దేవాలయానికి కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే కుమార్ రాజా 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత ఆలయాధికారి సుధాకర్, ప్రధాన అర్చకులు అగ్నిహోత్రంరామాచార్యులు, శర్మ, సుబ్బారావు తదితరులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గోరిపర్తి గిరిబాబు, వల్లూరిపల్లి గణేష్, తాడిశెట్టి సరేష్, కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, మాజీఏఎంసీ చైర్మన్ మండపాక శంకర్‌బాబు, కూనపరెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, పార్టీ నేతలు

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

తాడంకి(పమిడిముక్కల): లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని పాఠశాలకు, తలితండ్రులకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సూచించారు. తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల లో మంగళవారం పమిడిముక్కల, తోట్లవల్లూరు, పెదపారుపూడి, పామర్రు మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ కిట్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఉయ్యూరు డీవైఈవో పద్మారాణి, హెచ్ఎం ప్రసాద్, తాడంకి సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, మంటాడ సర్పంచ్ వీరమ్మ, మండలాల ఎంఈవోలు పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లకు జనసేన నాయకుల అభినందనలు

గుడివాడ : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాదెండ్ల మనోహర్‌ను మంగళవారం గుడివాడ జనసేన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కందుల రవి, పులపా మహేష్, పేర్ని జగన్ తదితరులలున్నారు.

